KR TV

# మన క్రాంతి


ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 349 | సోమవారం 01 డిసెంబర్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-


## నేటి మాట

స్వేచ్ఛ, సమానత్వం , సోదరభావాన్ని బోధించే మతం నాకు ఇష్టం



-డా.బి.ఆర్.అంబేద్కర్

### ఐబొమ్మ రవి, హిడ్మాలపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

వ్యవస్థలో లోపాలను సరిచేయకుంటే ఇలాంటి 'రవి'లే పుట్టుకొస్తారు




### నేషనల్ హెరాల్డ్ కేసులో 'మరో బాంబు, గాంధీ కుటుంబంపై బిగుస్తున్న ఉచ్చు కొత్త ఎఫ్ఐఆర్ తో దేశ రాజకీయం అట్టుడుకుతోంది




### ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జోనల్ వ్యవస్థకు గ్రీన్ సిగ్నల్ ,మూడు జోన్‌లుగా విభజన!




### రాజస్థాన్‌లో దారుణం, ప్రేమజంటకు సజీవ దహన యత్నం కుటుంబ సభ్యులపై కేసు నమోదు!




### కొండారెడ్డిపల్లిలో సర్పంచ్‌గా మాజీ మావోయిస్టు ఏకగ్రీవం




### నల్గొండలో దారుణం, బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్, నోట్లో మూత్రం పోసి దాడి!




### స్వామివారి 'లడ్డూ' మహా కుంభకోణం,డొంక కదిలించిన సిట్!




### కరీంనగర్ కళాకృతుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని




## అలా చేస్తే భారత్‌లో కూడా 'జిహాద్'..

### ఇస్లామిక్ సంస్థ అధ్యక్షుడు వివాదాస్పద కామెంట్స్




జమియత్ ఉలేమా ఇ హింద్ అధ్యక్షుడు మౌలానా మహ్మూద్ మదానీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. మైనార్టీలపై అణచివేత జరిగితే.. భారత్‌లో జీహాద్ జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ మైనార్టీ హక్కులను తక్కువ చేస్తోందని.. బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాక్ వంటి తీర్పులు చూస్తే.. న్యాయవ్యవస్థపై ప్రభుత్వ ఒత్తిడి ఉందనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగంలో మైనార్టీలకు పొందుపర్చిన హక్కులను బహిరంగంగా ఉల్లంఘించారన్నారు. ఈ మధ్య కాలంలో ఇలా మైనార్టీ హక్కులను తక్కువచేసే తీర్పులు చాలా వచ్చాయన్నారు. మైనార్టీల హక్కులు, న్యాయ వ్యవస్థపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. మదానీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

'భారత్‌లో కూడా జిహాద్..'

ప్రార్థన స్థలాల చట్టం ఉన్నప్పటికీ కేసుల విచారణ తీరును మదానీ తప్పుపట్టారు. రాజ్యాంగాన్ని కాపాడుతున్నంతసేపు మాత్రమే సుప్రీంకోర్టు.. సుప్రీంగా (అత్యున్నతంగా) ఉంటుందని చెప్పారు. అలా జరగనప్పుడు అది సుప్రీం కాదు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "సమాజంలో జీహాద్‌ను వక్రీకరిస్తున్నారు.

## ప్రభుత్వ నిధులతో ప్రచారమా..

### సీఎం జిల్లాల పర్యటనపై 'జాగృతి' అధ్యక్షురాలు కవిత అభ్యంతరం




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపటి నుంచి జిల్లాలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. అయితే సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ కొనసాగుతున్న క్రమంలో సీఎం జిల్లాల పర్యటనపై 'జాగృతి' అధ్యక్షురాలు కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన పర్యటనలు ఎన్నికల ప్రచారమేనని, ఇందుకోసం ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని 'జాగృతి' అధ్యక్షురాలు కవిత తన ట్వీట్‌లో ఆరోపించారు.

ఎన్నికలు గ్రామాల్లో జరగనున్న క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఆ జిల్లా కేంద్రాలకు వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. "ప్రభుత్వ సొమ్ముతో ప్రచారమా?" అని ప్రశ్నిస్తూ ఆమె ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఈ పర్యటనల కోసం జిల్లా ప్రజలందరినీ ప్రభుత్వ నిధులతో తరలించి, ముఖ్యమంత్రి తమ సందేశాన్ని ఇవ్వాలని చూస్తున్నారని, ఇది ముమ్మాటికీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనేనని ఆమె పేర్కొన్నారు.

## సోనియా, రాహుల్ గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు

- ఈడీ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు
- కుట్ర, మోసం, మనీలాండరింగ్ ఆరోపణలు
- యంగ్ ఇండియా-ఏజేఎల్ డీల్‌పై వివాదం
- 50 లక్షలకే 2,000 కోట్ల ఆస్తుల స్వాధీనం?




కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరితో పాటు మరి కొందరుకాంగ్రెస్ నేతలపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. నేషనల్ హెరాల్డ్ కేసులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై నేరపూరిత కుట్ర అభియోగాలు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిందితుల్లో సోనియా, రాహుల్ గాంధీతో పాటు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడా ఉన్నారు.

అంతేకాకుండా యంగ్ ఇండియా సంస్థ, డోటెక్స్ మెర్చండైజ్ లిమిటెడ్, అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) తదితర సంస్థలతో పాటు డోటెక్స్ ప్రమోటర్ సునిల్ భండారిపై కూడా ఎఫ్ఐఆర్‌లో అభియోగాలు మోపారు. నిందితులపై నేరపూరిత కుట్ర, మోసం, ఆస్తుల దుర్వినియోగం మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి.. ఈడీ పీఎమ్ఎల్ఏ చట్టంలోని సెక్షన్ 66(2) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించినట్లు అధికారులు తెలిపారు.

నిందితులందరూ కుట్రపూరితంగా కేవలం రూ. 50 లక్షలు మాత్రమే చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ. 2వేల కోట్ల విలువైన ఆసులపై అధికారాన్ని పొందారని ఈడీ ఆరోపించింది. అయితే నిందితుల్లో మోతీలాల్ వోరా 2020లో మృతిచెందారు, ఆస్కార్ ఫెర్నాండెజ్ 2021లో మరణించిన విషయం తెలిసిందే. కాగా, అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన నేషనల్ హెరాల్డ్ పత్రికను.. కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల లోన్ అందించి దాని ఆస్తుల్ని ఆధీనంలోకి తీసుకుంది.

## సకాలంలో ఫైర్ ఇంజన్లు రాలేదు!

### కొండగట్టు భారీ అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు




జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అభయాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో శనివారం అర్ధరాత్రి జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కు ఫోన్ చేసి మాట్లాడిన కేటీఆర్, క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి, ఎంతో కష్టపడి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ప్రమాదంతో ఒక్కసారిగా రోడ్డున పడ్డాయని కేటీఆర్ ఆవేదన చెందారు. షాపుల్లో ఉన్న సరుకు, బొమ్మలు, ఇతర సామాగ్రి సర్వం అగ్నికి ఆహుతి అయ్యాయని, దాదాపు 30 కుటుంబాల భవిష్యత్తు నాశనమైందని విచారం వ్యక్తం చేశారు. సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సకాలంలో ఫైర్ ఇంజన్లు రాకపోవడమే ఆస్తి నష్టం ఇంత భారీగా పెరగడానికి ప్రధాన కారణమని కేటీఆర్ ఆరోపించారు.



## ప్లీజ్.. ఒక్క బెల్ట్ షాపు ఇప్పించండి సారూ

- కొత్త షాపులతో బెల్ట్ రేసు వేడి
- అనుమతుల కోసం లాబీయింగ్ హైలో
- యువతలో బెల్ట్ బిజినెస్ క్రేజ్
- చిన్న పెట్టుబడి-పెద్ద లాభాల ఆకర్షణ
- గ్రామాల్లో స్వీయ నియంత్రణ నిబంధనలు
- అనుమతి లేని షాపులపై చర్యలు
- ఎన్నికల ముందు బెల్ట్ పోటీ పీక్‌లో

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల కొత్త మద్యం షాపులు తెరుచుకోనున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న బెల్ట్ షాపుల్లోనూ మార్పులు చోటుచేసుకోనున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులను దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి. షాపులను తమకే ఇప్పించాలంటూ ఏకంగా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వ్యాపారులు ప్రాధేయపడుతున్నారు. ఈ మధ్య లక్కీ డ్రాలో మద్యం షాపులను సొంతం చేసుకున్న వ్యాపారులకు డిసెంబరు 1 నుంచి లిక్కర్ సేల్ చేసేందుకు ఎక్సయిజ్ శాఖ అనుమతిని ఇస్తుంది. అందుకే కొత్తగా బెల్ట్ షాపు బిజినెస్ చేసేందుకు సిద్ధమైన వ్యాపారులు వాటిని సొంతం చేసుకునేందుకు రంగంలోకి దిగారు. అందుకోసం హైదరాబాద్‌కు వచ్చి రూలింగ్ పార్టీ లీడర్ల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది.


మిగతాది 2 లో


### కొండగట్టు అంజన్న ఆలయం వద్ద ఘోర అగ్నిప్రమాదం,30కి పైగా దుకాణాలు దగ్ధం




తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన 30కి పైగా దుకాణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. శనివారం (నవంబర్ 29, 2025) అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

### కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ అస్తవ్యస్తం,మాదాపూర్ కూల్చివేతలు నిదర్శనం




ఐటీ హబ్ మాదాపూర్‌లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా వెలసిన దుకాణాలను, షెడ్లను హైడ్రా అధికారులు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా, మైండ్ స్పేస్ వైపు వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఫుడ్ కోర్టులు, ఇతర దుకాణాలు నడుస్తుంటే... గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

## ఐబొమ్మ రవి, హిడ్మాలపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు, వ్యవస్థలో లోపాలను సరిచేయకుంటే ఇలాంటి 'రవి'లే పుట్టుకొస్తారు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఐబొమ్మ' రవి, మావోయిస్టు హిడ్మా అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థీకృత లోపాలనే వారు అలా మారడానికి కారణమని ఆరోపించారు.

తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, 'ఐబొమ్మ'లో తాను కూడా సినిమాలు ఉచితంగా చూశానని సంచలన ప్రకటన చేశారు. "ఆరేడు వందలు పెట్టి ఎలా చూసేది అని చూశాను. అద్భుతమైన తెలివితేటలు ఉన్న రవి అలా మారడానికి కారణం ఈ వ్యవస్థలే" అని నారాయణ వ్యాఖ్యానించారు.ఐబొమ్మలో నేను సినిమాలు ఫ్రీగా చూశాను. ఆరేడు వందలు పెట్టి టికెట్ కొనలేకనే సినిమాను అక్కడ చూశాను.తెలివితేటలు ఉన్న రవి ఆ మార్గాన్ని ఎంచుకోవడానికి కారణం ఈ వ్యవస్థలో ఉన్న లోపాలే. వ్యవస్థలో లోపాలను సరిచేయకుండా ఉంటే ఇలాంటి రవిలే పుట్టుకు వస్తారని ఆయన హెచ్చరించారు. రవిని జైల్లో వేసినా, ఉరితీసినా ప్రయోజనం ఉండదని, కోట్లాది రూపాయలు దోచుకుంటున్న సినిమా మాఫియాను ఉరితీస్తేనే సమాజానికి ఉపయోగం ఉంటుందని నారాయణ అన్నారు.ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది హిడ్మాలు పుడతారు అని మావోయిస్టు అంశాన్ని ప్రస్తావిస్తూ వ్యవస్థీకృత లోపాల పర్యవసానాలను నారాయణ నొక్కి చెప్పారు.?నారాయణ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పైరసీని ఆయన సమర్థిస్తూ చేసిన ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నేషనల్ హెరాల్డ్ కేసులో 'మరో బాంబు, గాంధీ కుటుంబంపై బిగుస్తున్న ఉచ్చు

### కొత్త ఎఫ్ఐఆర్ తో దేశ రాజకీయం అట్టుడుకుతోంది

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి నేషనల్ హెరాల్డ్ కేసులో ఊహించని షాక్ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, ఢిల్లీ పోలీసులు తాజాగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇది గాంధీ కుటుంబంపై ఉన్న ఉచ్చును మరింత బిగిస్తోంది.

ఈ కొత్త ఎఫ్ఐఆర్‌లో సోనియా, రాహుల్‌తో పాటు మరో ఆరుగురి పేర్లను చేర్చారు. వీరందరిపైనా నేరపూరిత కుట్ర, మోసం, విశ్వాస ఘాతుకం వంటి తీవ్ర ఆరోపణలు నమోదయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు కొనసాగుతుండగా, ఢిల్లీ పోలీసుల ఈ చర్య దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది.షెల్ కంపెనీ' పాత్రపై దృష్టి

ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన ఈ ఎఫ్ఐఆర్‌లో యంగ్ ఇండియన్ సంస్థతో పాటు, కోల్‌కతా కేంద్రంగా ఉన్న డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే షెల్ కంపెనీ పేరును కూడా పేర్కొన్నారు.అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ. 2,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను కేవలం రూ. 50 లక్షల నామమాత్రపు చెల్లింపుతో అక్రమంగా చేజిక్కించుకోవడానికి సోనియా, రాహుల్‌లు కుట్ర పన్నారని ఈడీ ఆరోపిస్తోంది.డోటెక్స్ మర్చండైజ్ ద్వారా యంగ్ ఇండియన్‌కు నిధులు మళ్లినట్టు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఏజేఎల్ ఆస్తుల అక్రమ స్వాధీనంలో ఈ డొటెక్స్ కంపెనీ పాత్రపై పోలీసులు మరింత లోతుగా దృష్టి సారించారు.ఈ కేసులో ఈడీ ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేయగా, దాన్ని విచారణకు స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై ఢిల్లీ కోర్టు డిసెంబర్ 16న తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. సరిగ్గా ఈ కీలక సమయంలో ఢిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై చట్టపరమైన, రాజకీయ ఒత్తిడి మరింత పెరిగింది.

కాంగ్రెస్ నాయకులు మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపారేస్తూ, ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత వేధింపు చర్యగా అభివర్ణించారు.

అయితే, కొత్తగా నమోదైన ఈ ఎఫ్ఐఆర్ వల్ల కేసు దర్యాప్తు వేగం పుంజుకుని, తదుపరి పరిణామాలు మరింత వేడిగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గాంధీ కుటుంబానికి సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ కేసులో, పోలీసుల తదుపరి విచారణ, కోర్టు నిర్ణయం దేశ రాజకీయాలపై ప్రభావం చూపడం ఖాయం.

## ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జోనల్ వ్యవస్థకు గ్రీన్ సిగ్నల్ ,మూడు జోన్‌లుగా విభజన!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ, మెరుగైన పర్యవేక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జోనల్ వ్యవస్థకు తాజాగా గ్రీన్ సిగ్నల్ లభించింది. రాష్ట్రంలోని ప్రాంతాలను పరిపాలనా సౌలభ్యం కోసం మూడు ప్రధాన జోన్‌లుగా విభజించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

ప్రభుత్వం నిర్ణయం మేరకు, రాష్ట్రంలో ఇకపై విశాఖపట్నం, అమరావతి, రాయలసీమ కేంద్రాలుగా మూడు జోన్‌లు (ప్రాంతాలు) పనిచేయనున్నాయి.

నూతన జోనల్ వ్యవస్థలో పరిపాలనాపరమైన పర్యవేక్షణ కోసం ప్రతి జోన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా నియమిస్తూ ప్రభుత్వం నియామక ప్రక్రియను పూర్తి చేసింది.

## స్వామివారి 'లడ్డూ' మహా కుంభకోణం డొంక కదిలించిన సిట్!

కంచే చేను మేసిన వేళ! టీటీడీ కొనుగోలు విభాగంలో పెను ప్రకంపనలు! తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం ఇప్పుడు మహా కుంభకోణంగా రూపు దాల్చింది. భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తూ, పవిత్రమైన ప్రసాదం తయారీలో అడుగడుగునా అక్రమాలు జరిగినట్లు సిట్ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి.నిందితుల సంఖ్య 35కు పెరుగుదల! కీలకంగా టీటీడీ ఉద్యోగులు కేసు నమోదు సమయంలో 15 మంది, ఆ తర్వాత 9 మంది నిందితులుగా చేర్చగా, తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేరుస్తూ సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో నిందితుల సంఖ్య 35కు చేరింది. తాజా జాబితాలో ఏడుగురు టీటీడీ ఉద్యోగులు ఉండటం వ్యవస్థలోని లోపాలను కళ్లకు కడుతోంది. వీరిలో కొనుగోలు విభాగంలో పనిచేసిన జనరల్ మేనేజర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఆర్ఎస్ఎస్‌విఆర్ సుబ్రహ్మణ్యం అరెస్టు అయ్యారు. కల్తీ నెయ్యి సరఫరాదారులకు లంచాలు తీసుకుని, నాణ్యతా పరీక్షా నివేదికలను ఉద్దేశపూర్వకంగా అణచివేశారని సిట్ రిమాండ్ రిపోర్టులో తేలింది. ఈయన అరెస్టుతో టీటీడీలోని అంతర్గత బాగోతం బట్టబయలైంది.250 కోట్ల స్కామ్! 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి!

2019 నుంచి 2024 మధ్య కాలంలో 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి టీటీడీకి సరఫరా అయినట్లు సిట్ గుర్తించింది. దీని విలువ దాదాపు రూ. 250 కోట్లు!?20 కోట్లకు పైగా లడ్డూలు కల్తీ నెయ్యితో తయారయ్యాయి. కల్తీ చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్ వంటి రసాయనాలు ఉన్నట్లు తేలింది. కల్తీ నెయ్యి కుంభకోణానికి ప్రధాన కేంద్రంగా టీటీడీ కొనుగోలు విభాగం మారిపోయింది. టెండర్ల దశ నుంచి నాణ్యతా పరీక్షల వరకు ప్రతి అడుగులోనూ ఉద్యోగులు కాంట్రాక్టర్లతో చేతులు కలిపినట్లు స్పష్టమవుతోంది. కొనుగోలు విభాగాన్ని ప్రక్షాళన చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.?సిట్ దర్యాప్తు తుది దశకు చేరుకోవడంతో, త్వరలో ఫైనల్ ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. మరిన్ని అరెస్టులు, ఉన్నత స్థాయి అధికారులపై చర్యలు తప్పకపోవచ్చని తెలుస్తోంది. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసిన ఈ అక్రమాలపై ప్రభుత్వం ఏ విధంగా ఉక్కుపాదం మోపుతుందో వేచి చూడాలి.

## రాజస్థాన్‌లో దారుణం, ప్రేమజంటకు సజీవ దహన యత్నం కుటుంబ సభ్యులపై కేసు నమోదు!

జైపూర్ గ్రామీణ ప్రాంతంలో హృదయాన్ని కలచివేసే ఘటన చోటుచేసుకుంది. ప్రేమించుకున్న యువతీ యువకుడికి వారి కుటుంబ సభ్యులే పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేయడానికి ప్రయత్నించారు. ఈ దారుణంలో తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న ప్రేమ జంటను చికిత్స నిమిత్తం జైపూర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

జైపూర్ పరిధిలోని మోఖంపురా పోలీస్ స్టేషన్ పరిధిలోని భరోలావ్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ అమానుష ఘటన జరిగింది.ఒకే గ్రామానికి చెందిన యువకుడు (కైలాష్ గుజ్జర్ - 40) మరియు యువతి (సోని గుజ్జర్ - 32) కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి సంబంధాన్ని అమ్మాయి కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.శుక్రవారం రాత్రి ప్రియుడిని కలుసుకోవడానికి వెళ్లిన యువతిని కుటుంబ సభ్యులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆగ్రహంతో ఊగిపోయిన కుటుంబ సభ్యులు ఇద్దరిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయారు. యువతీ యువకుల అరుపులు విన్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే ఇద్దరికీ తీవ్రమైన గాయాలయ్యాయి.

యువకుడు 60% నుంచి 70% కాలిన గాయాలు.

యువతి 30% నుంచి 45% కాలిన గాయాలు.

ముందుగా బిచూన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి, అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరువాత, మెరుగైన వైద్యం కోసం వారిని జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ (ఎస్ఎంఎస్) ఆస్పత్రి బర్న్స్ వార్డుకు తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.మోఖంపురా పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుల వాంగ్మూలం ఆధారంగా యువతి కుటుంబ సభ్యులైన బిర్దిచంద్ మరియు గణేష్తో సహా పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన భరోలావ్ గ్రామంలో మరియు జైపూర్ గ్రామీణ ప్రాంతంలో సంచలనం సృష్టించింది.

## కొండారెడ్డిపల్లిలో సర్పంచ్‌గా మాజీ మావోయిస్టు ఏకగ్రీవం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం అయిన నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలం, కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ గ్రామానికి మాజీ మావోయిస్టు, మల్లెపాకుల వెంకటయ్య సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కొండారెడ్డిపల్లి సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామంలో మల్లెపాకుల వెంకటయ్య సర్పంచ్ గా ఏకగ్రీవం అయ్యారు. ఈ సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వ్ అయింది. వెంకటయ్య గతంలో మావోయిస్టు దళంలో పనిచేశారు.ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కల్వకుర్తి, గంగన్న, పాన్‌గల్ దళాల్లో 2000 వరకు చురుకుగా పనిచేశారు. 2001లో వెంకటయ్య కల్వకుర్తి పోలీసుల సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు.2003లో కల్వకుర్తి పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా ఎంపికై ఇప్పటివరకు అక్కడే పనిచేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబానికి వెంకటయ్య సన్నిహితుడు కావడంతో, సీఎం చొరవతో గ్రామస్థులు, నాయకులంతా ఏకగ్రీవంగా ఆయన్ని సర్పంచ్‌గా ఎన్నుకోవాలని తీర్మానించారు.

సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయడానికి వెంకటయ్య తన హోంగార్డు ఉద్యోగానికి రాజీనామా చేశారు. శనివారం (నవంబర్ 29, 2025) ఆయన తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు.ఈ ఏకగ్రీవ ఎన్నిక ద్వారా మాజీ మావోయిస్టుకు కీలకమైన పదవి దక్కడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## నల్గొండలో దారుణం, బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్, నోట్లో మూత్రం పోసి దాడి!

నల్గొండ జిల్లాలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరులు దారుణమైన అరాచకానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.యాదగిరి యాదవ్ (బీఆర్ఎస్ బీసీ సర్పంచ్ అభ్యర్థి నాగలక్ష్మి భర్త) నల్గొండ జిల్లా, ఎల్లమ్మగూడెం గ్రామం.బోళ్ల వెంకట్ రెడ్డి, ఉట్కూరి సందీప్ రెడ్డి (కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరులు)

ఎల్లమ్మగూడెం గ్రామంలో బీఆర్ఎస్ మద్దతుతో నాగలక్ష్మి అనే మహిళ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి సిద్ధమయ్యారు. ఇది నచ్చని కాంగ్రెస్ వర్గానికి చెందిన ఇద్దరు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరులు – బోళ్ల వెంకట్ రెడ్డి, ఉట్కూరి సందీప్ రెడ్డి – దారుణానికి ఒడిగట్టారు.సర్పంచ్ అభ్యర్థి భర్త అయిన యాదగిరి యాదవ్‌ను కిడ్నాప్ చేసిన నిందితులు, "తమకు వ్యతిరేకంగా నామినేషన్ వేసేంత మొగోడివా?" అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అత్యంత హేయమైన చర్యగా, వారు యాదగిరి యాదవ్ నోట్లో మూత్రాన్ని పోసి, ఆపై విచక్షణారహితంగా దారుణంగా కొట్టారు.ఈ దారుణ ఘటనతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "తెలంగాణలో ఉన్నామా లేక బీహార్‌లో ఉన్నామా?" అంటూ తమ ఆవేదనను వెళ్లగక్కారు.బాధితుడు యాదగిరి యాదవ్ కుటుంబ సభ్యులు ఈ అమానుష చర్యపై తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి న్యాయం చేయాలని మానవ హక్కుల కమిషన్‌ను (ఎచ్ఆర్సి) డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి కిడ్నాప్‌లు, హింసకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే పెను సవాల్‌గా మారిందని స్థానిక రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## కరీంనగర్ కళాకృతుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో తెలంగాణలోని కరీంనగర్ కళాకృతుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.'వొకల్ ఫర్ లోకల్' నినాదం, ఇటీవల జరిగిన జి20 సమ్మిట్‌లో ప్రపంచ దేశాల నాయకులకు తాను అందించిన బహుమతుల్లో 'వొకల్ ఫర్ లోకల్' స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకున్నానని ప్రధాని మోదీ తెలిపారు.ఈ బహుమతులలో తెలంగాణలోని కరీంనగర్‌లో తయారైన సాంప్రదాయ కళాకృతులు ఉన్నాయని, అవి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని మోదీ కొనియాడారు. కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ ఆర్ట్ తో తయారు చేసిన బుద్ధుడి ప్రతిమను బహుకరించారు.సాంప్రదాయ పూల ఆకృతితో ఉన్న వెండి అద్దం బహుకరించారు. ఇది కరీంనగర్ సాంప్రదాయ లోహ కళాత్మకతను ప్రతిబింబిస్తుంది.భారతీయ చేతివృత్తులు, కళలు, సంప్రదాయాల గురించి ప్రపంచానికి తెలియజేయడం, మన కళాకారుల ప్రతిభకు అంతర్జాతీయ వేదికను అందించడం తన లక్ష్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.రాబోయే క్రిస్మస్ వంటి పండుగల సీజన్‌లో కూడా 'వొకల్ ఫర్ లోకల్' మంత్రాన్ని గుర్తుంచుకోవాలని, దేశంలో తయారైన వస్తువులనే కొనుగోలు చేయాలని ప్రజలను కోరారు.ప్రధానమంత్రి చేసిన ఈ ప్రస్తావన కరీంనగర్ కళాకారులకు, వారి సిల్వర్ ఫిలిగ్రీ ఆర్ట్‌కు ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడానికి దోహదపడుతుంది.

### కొండగట్టు అంజన్న ఆలయం వద్ద ఘోర అగ్నిప్రమాదం,30కి పైగా దుకాణాలు దగ్ధం

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన 30కి పైగా దుకాణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.శనివారం (నవంబర్ 29, 2025) అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.ప్రాథమిక అంచనా ప్రకారం, బొమ్మలు, పూజా సామగ్రి, ఇతర వస్తువులను విక్రయించే 30 నుండి 32 దుకాణాలు దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.నిత్యం భక్తుల రద్దీతో కళకళలాడే ఈ ప్రాంతంలో దుకాణాలు కాలి బూడిదవడం స్థానిక వ్యాపారులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. తమ జీవనాధారం కోల్పోయామని వ్యాపారులు కన్నీరుమున్నీరయ్యారు.

## కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ అస్తవ్యస్తం,మాదాపూర్ కూల్చివేతలు నిదర్శనం

ఐటీ హబ్ మాదాపూర్‌లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా వెలసిన దుకాణాలను, షెడ్లను హైడ్రా అధికారులు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా, మైండ్ స్పేస్ వైపు వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఫుడ్ కోర్టులు, ఇతర దుకాణాలు నడుస్తుంటే... గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.ఈ అక్రమ దుకాణాలు ఒక్క రోజులో వెలవలేదు. రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు జరిగి ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది.జీహెచ్ఎంసీ, టీఎస్ఐఐసీ వంటి సంస్థలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను గాలికొదిలేయడం వల్లే నగరంలో ఎక్కడ చూసినా ఇటువంటి ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఎందుకీ ఆరాటం ప్రజల నుంచి తీవ్ర విమర్శలు, ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిన తర్వాతే హడావిడిగా కూల్చివేతలు చేపట్టడం చూస్తే, ఇది కేవలం ప్రచారం కోసమే తప్ప, పటిష్టమైన పాలనలో భాగం కాదని స్పష్టమవుతోంది.మైండ్ స్పేస్ వంటి కీలక ప్రాంతంలో అక్రమ షాపుల ముందు వాహనాలు పార్క్ చేయడంతో రోడ్లు ఇరుకుగా మారి, గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, ఐటీ ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో, పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడి, ప్రమాదాలు జరిగే అవకాశం పెరిగింది. పౌరుల భద్రతను కాపాడడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.ఈ అక్రమ నిర్మాణాలను ఇంతకాలం ఎందుకు ఉపేక్షించారు కూల్చివేతలకు ముందు స్థానిక నేతలు, అధికారుల ప్రమేయంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి సారించడం లేదు? కేవలం షెడ్లు తొలగిస్తే సరిపోతుందా, ఆక్రమణలకు పాల్పడిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలిక కూల్చివేతలకే పరిమితం కాకుండా, హైదరాబాద్‌ను ఆక్రమణ రహిత నగరంగా మార్చేందుకు శాశ్వత ప్రణాళికను ప్రకటించాలి. నగరంలో కలుగుతున్న ఈ అస్తవ్యస్త పరిస్థితికి ముఖ్యమంత్రి నగర ప్రజలకు సమాధానం చెప్పాలి.

## ప్లీజ్.. ఒక్క బెల్ట్ షాపు ఇప్పించండి సారూ..

మొదటి పేజీ తరువాయి

పెద్ద ఎత్తున లాభాలు..

చాలా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించేందుకు యువత ఉత్సాహం చూపుతున్నట్లు తెలిసింది. ఎక్కువ మొత్తంలో లాభాలు ఉంటాయనే ప్రచారంతో ఆ షాపులకు డిమాండ్ పెరుగుతున్నది. ప్రతి రోజూ కనిష్టంగా రూ. 2 వేలు, గరిష్టంగా రూ. 5 వేల వరకు ప్రాఫిట్ ఉంటుందని టాక్ ఉంది. పైగా పెట్టుబడి సైతం రూ.లక్షల్లో ఉండదు. రూ.10 నుంచి 15 వేలు పెడితే సరిపోతుంది. సాయంత్రం వరకు పెట్టుబడితో పాటే లాభం కూడా వస్తుంది. ఈ క్రమంలోనే బెల్ట్ షాపులను దక్కించుకునేందుకు యువత పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్టు తెలిసింది. స్థానికంగా ఉండే లిక్కర్ షాపుల వద్ద బెల్ట్ షాపు నిర్వాహకులు బల్క్‌గా మద్యం కొనుగోళ్లు చేస్తుంటారు. బాటిల్‌పై ఉండే ఎంఆర్‌పీ ధర కంటే అదనంగా రూ.40 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుంటారు. గ్రామస్తులు సైతం మద్యం కోసం మండల కేంద్రానికో, పట్టణానికో వెళ్లాల్సిన అవసరం ఉండదు. అందుకే బెల్ట్ షాపుల కోసం ఇంట్రెస్ట్ చూపుతున్నట్టు తెలిసింది.

కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులపై నియంత్రణ..

నిజానికి ఒక గ్రామంలో ఎన్ని బెల్ట్ షాపులు ఉండాలి? అనే నిబంధనను ఎక్సయిజ్ శాఖ విధించలేదు. కానీ చాలా గ్రామాలు విచ్చలవిడిగా షాపులు నిర్వహించడాన్ని చెక్ పెట్టేందుకు స్వీయ నియంత్రణ పాటిస్తున్నాయి. ఒకటి లేదా రెండు షాపులకు మాత్రమే అనుమతి ఇవ్వాలని సొంతంగా రూల్స్ పెట్టుకున్నాయి. దీంతో అనుమతి తీసుకున్న షాపులు ప్రతి ఏటా కొంత మొత్తాన్ని గ్రామ పంచాయతీకి ఫీజు రూపంలో చెల్లించాలి. ఒకవేళ అనుమతి లేని షాపుల్లో మద్యం విక్రయిస్తే ఎక్సయిజ్ శాఖకు ఫిర్యాదు చేసి, కేసులు నమోదు చేయిస్తుంటారు. ప్రస్తుతం ఆ షాపులను దక్కించుకునేందుకే స్థానిక లీడర్లు మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది.

ఎన్నికల వేళ పెరుగుతున్న పోటీ..

బెల్ట్ షాపులపై అటు పోలీసు, ఇటు ఎక్సైజ్ శాఖల నుంచి కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎందుకంటే బెల్ట్ షాపులను నియంత్రించేందుకు ఇంతవరకు ఎలాంటి యాక్షన్ ప్లాన్ లేదు. ఆ షాపుల నిర్వహణ వల్ల సర్కారుకు ఆదాయం సమకూరుతోందనే అభిప్రాయంలో ఉన్న అధికారులు పరోక్షంగా వాటిని నిర్వహించేందుకు ప్రోత్సహిస్తున్నారు. అలాగే రూలింగ్ పార్టీ లీడర్లు సైతం తమ సన్నిహితులకు మాత్రమే బెల్ట్ షాపులు ఇవ్వాలని అటు గ్రామపెద్దలకు, ఇటు ఎక్సయిజ్ అధికారులకు సంకేతాలు ఇస్తున్నారు. దీనితో తమ పార్టీ కేడర్‌కు ఏదో ఒక ఫేవర్ చేశామని సంతృప్తి పడుతున్నారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉండటంతో బెల్ట్ షాపుల ద్వారా పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించవచ్చనే ఆశతో గ్రామస్థాయి లీడర్లు షాపుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

## ప్రభుత్వ నిధులతో ప్రచారమా.. సీఎం జిల్లాల పర్యటనపై 'జాగృతి' అధ్యక్షురాలు కవిత అభ్యంతరం

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల కమిషన్ ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనను నిలిపివేయాలి. ప్రభుత్వ నిధులను ఉపయోగించి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాన్ని ఎన్నికల సంఘం అడ్డుకోవాలి" అని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ అమలులో ఉన్న ప్రస్తుత సమయంలో, ఈ రకమైన ప్రభుత్వ కార్యక్రమాలు పారదర్శక ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై అధికార పక్షం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## అలా చేస్తే భారత్‌లో కూడా 'జిహాద్'..

### ఇస్లామిక్ సంస్థ అధ్యక్షుడు వివాదాస్పద కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం, మీడియా కలిసి ఈ పవిత్ర విధానాన్ని వక్రీకరిస్తున్నాయి. లవ్ జీహాద్, ల్యాండ్ జిహాద్, స్పిట్ జీహాద్.. వంటి పదాలను వాడటం తప్పు. జీహాద్ ఎప్పటికీ పవిత్రమైనదే. ఇతరుల మంచి కోసమే జీహాద్ జరుగుతుంది. అణిచివేయాలని చూస్తే జీహాద్ జరగక తప్పదు" అని మదానీ హెచ్చరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

'మేము వందేమాతరం పాడము..'

ఇవే కాకుండా మరిన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు మహ్మూద్ మదానీ. ముస్లింలు రాజ్యాంగానికి విధేయులై ఉంటారని చెప్పిన మదానీ.. వందేమాతరం పాడటాన్ని కూడా విమర్శించారు. వలం చేతకాని సామాజిక వర్గమే లొంగిపోతుందని.. వందేమాతరం పాడమని అడగ్గానే పాడేది అలాంటి వారేనని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంబరాలు జరుగుతున్న వేళ.. మదానీ తీవ్ర దుమారం రేపుతున్నాయి.

మదానీకి బీజేపీ స్ట్రాంగ్ వార్నింగ్..

మదానీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు భగ్గుమన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు మదానీ ప్రయత్నించారని, రాజ్యాంగబద్ధ సంస్థలను సవాల్ చేశారని మండిపడ్డారు బీజేపీ ఎమ్మెల్యే రామేశ్వర్ శర్మ. దేశంలో కొత్త జిన్నాలు పుట్టుకొచ్చి.. ముస్లింలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మదానీ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సుమోటోగా పరిగణించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మదానీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని.. సుప్రీం కోర్టునే సవాల్ చేశారని ధ్వజమెత్తారు. మదానీ వంటి వ్యక్తులే.. ఉగ్రవాదులు, జీహాదీలు, రేపిస్టులను తయారు చేస్తారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసి.. అమాయకులను చంపితే సుప్రీంకోర్టు బహుమానాలు ఇవ్వాలా అంటూ మండిపడ్డారు. మదానీ లాంటి వాళ్లకు సుప్రీంకోర్టు ఉరేస్తుంది అని తీవ్రంగా హెచ్చరించారు. తప్పుడు ప్రవర్తనను మదానీ అదుపులో పెట్టుకోవాలని వార్నింగ్ ఇచ్చారు.

జమియత్ ఉలేమా ఇ హింద్ భారతదేశంలోని పురాతన, అత్యంత ప్రభావవంతమైన ఇస్లామిక్ సంస్థలలో ఒకటి. దీన్ని 1919లో ముస్లిం సామాజిక, మత, రాజకీయ ఆందోళనలకు ప్రాతినిధ్యం వహించడానికి స్థాపించారు. ఈ సంస్థ.. ముస్లిం సంక్షేమం, విద్య, చట్టపరమైన హక్కులు వంటి అంశాలపై పనిచేస్తుంది. అలాంటి సంస్థ అధ్యక్షుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

# సకాలంలో ఫైర్ ఇంజన్లు రాలేదు!

## కొండగట్టు భారీ అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

జగిత్యాల ఫైర్ ఇంజన్ రిపేర్‌లో ఉండటం, వచ్చిన ఒక ఇంజన్ పని చేయకపోవడం, గంట తర్వాత కోరుట్ల, కరీంనగర్ నుంచి వాహనాలు రావడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

సర్వం కోల్పోయిన ఈ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జరిగిన ఆస్తి నష్టం, పూర్తిగా దెబ్బతిన్న వ్యాపారాన్ని, దుకాణాలు ఏమాత్రం పనికిరాని స్థితికి చేరడాన్ని దృష్టిలో ఉంచుకొని, మానవతా దృక్పథంతో ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం విషయం తెలియగానే అక్కడికి చేరుకుని, సహాయక చర్యల్లో పాల్గొని, బాధితులకు తక్షణ సాయంగా రూ. 5000 అందజేసిన మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ను కేటీఆర్ అభినందించారు. స్థానికులకు, నష్టపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోకుంటే, పార్టీ తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

## లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ప్రైవేటు బస్సు..ఇద్దరు మృతి



ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నేరేడిగొండ మండలం బోథ్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి యూపీలోని గోరఖ్‌పూర్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు.


## దారుణం..ముళ్ల పొదల్లో నవజాత శిశువు..



జిల్లాలో దారుణం జరిగింది. అప్పుడే పుట్టిన నవజాత ఆడ శిశువును తల్లిదండ్రులు ముళ్ల పొదల్లో పడేసి మానవత్వాన్ని మంటగలిపారు. అటుగా వెళ్తున్న స్థానికులు శిశువు ఏడుపు విని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది పరీక్షించి వైద్యం అందించి రక్షించి బాధ్యతను నెరవేర్చారు.

నారాయణపేట మండలం అప్పక్ పల్లి గ్రామం కాటన్ మిల్ సమీపంలో ముళ్లపొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఆడశిశువును వదిలేసి వెళ్లారు. స్థానికులు చిన్నారి ఏడుపులు విని అంబులెన్స్‌కు సమాచారం అందజేయడంతో హుటాహుటిన వారు అక్కడికి చేరుకొని, ఆ నవజాత శిశువును కాపాడారు. స్వల్ప గాయాలతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న శిశువును గమనించిన అంబులెన్స్ టెక్నీషియన్స్ శిరీష ప్రథమ చికిత్స చేసి నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేందర్ శిశువును పరీక్షించి, ప్రస్తుతం శిశువు ఆరోగ్యం మెరుగ్గానే ఉందని వెల్లడించారు. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన 108 సిబ్బంది, టెక్నీషియన్ శిరీష, పైలెట్ రాములును అంబులెన్స్ సూపర్‌వైజర్ రాఘవేంద్ర అభినందించారు.

## రాష్ట్ర ప్రజలకు గుడ్ న్యూస్.. విద్యుత్ ఛార్జీలపై డిస్కంల కీలక నిర్ణయం



తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) నుంచి విద్యుత్ ఛార్జీల పెరుగుదలపై కీలక అప్ డేట్ వచ్చింది. రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) అయిన టీజీఎస్‌ఎస్పీడీసీఎల్ , టీజీపీడీసీఎల్ తమ వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) వివరాలు, టారిఫ్ ప్రతిపాదనలను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్సీ)కి దాఖలు చేశాయి. ఇందులో 2026–27 ఆర్థిక సంవత్సరంలో కరెంటు ఛార్జీలు పెంచవద్దని డిస్కమ్ లో నిర్ణయించాయి. ఈ మేరకు ఎలక్షన్ కోడ్ ముగియగానే డిస్కంల ప్రతిపాదనలపై ఈఆర్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీజీఈఆర్సిసలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు తెలుస్తుంది. అలాగే బహిరంగ విచారణ తర్వాత టారిఫ్ ఆర్డర్ ఇవ్వనుంది. అనంతరం 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఛార్జీలు అమలవుతాయి.

ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తక్కువ రేట్లకే విద్యుత్ అందిస్తుంది. అలాగే గృహ జ్యోతి పథకంలో భాగంగా అర్హులకు ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ ను అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఉచితి విద్యుత్ వల్ల డీస్కంలపై భారం పడుతుందని, త్వరలోనే ఛార్జీలు పెంచే అవకాశం ఉందని అనేక వార్తరు ప్రచారంలోకి వచ్చాయి. కానీ అలాంటి వార్తలకు.. టీజీఎస్ఎస్పీడీసీఎల్, టీజీపీడీసీఎల్ తాజా నిర్ణయంతో చెక్ పెట్టాయి.

## టేకులపల్లిలో భారీగా గంజాయి పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. టేకులపల్లి మండలంలోని సాయన్నపేట క్రాస్ రోడ్డు సమీపంలో మూల మలుపు వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా టేకులపల్లి పోలీసులు రూ.99లక్షల 83వేల గల 199.673కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్యాకెట్ల రూపంలో కారు డిక్కీలో పెట్టి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇల్లందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

గంజాయిని కొనుగోలు చేసి ఆంధ్ర – ఒడిషా బార్డర్ నుండి రాజస్థాన్‌కు తరలిస్తుండగా శనివారం టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లాల్ సింగ్ చౌహాన్‌ని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని తెలిపారు. లాల్ సింగ్ చౌహాన్ పై ఇదివరకు మూడు కేసులు ఉన్నాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్ఐ ఆలకుంట రాజేందర్, బోడ్ ఎస్ఐ పి. శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ గ్రామంలో ఎస్టీ రిజర్వేషన్లు.. ఎన్నికలను బహిష్కరిస్తున్న స్థానికులు



ఎన్నికల అధికారులు, సిబ్బంది అందరూ కలిసి నిర్వహించిన సర్వే ప్రకారం ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ప్రకారమే ఎన్నికల సంఘం పంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారు చేసింది. అయితే తప్పిదం ఎవరో తెలియదు కానీ ఇప్పుడు ఆ పంచాయతీ కేటాయించిన రిజర్వేషన్ వారికి శాపంగా మారిందని చెప్పక తప్పదు. తమ పంచాయితీలో ఎస్టీలు ఎవరూ లేకపోయినా ఎస్సీ రిజర్వేషన్ ఎలా కేటాయించారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పు ఎవరు చేసినా కానీ ఆ పంచాయతీ ప్రజలకు మాత్రం తీవ్ర సంకటంగా మారిందని చెప్పక తప్పదు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామపంచాయతీలో ప్రజలంతా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలకతీతంగా ఎన్నికలకు దూరం ఉండనున్నట్లు స్పష్టం అవుతుంది. ఎస్టీలు లేని గ్రామంలో ఎస్టీ రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారంటూ అధికారులు నిలదీస్తున్నారు. తన పంచాయతీలో 8 వార్డులు ఉండగా నాలుగు వార్డులు ఎస్టి, నాలుగు వార్డులు జనరల్ తో పాటు సర్పంచ్ ఎస్టీ మహిళను కేటాయించడంతో అసలు ఎస్టీలు లేని తమ గ్రామంలో ఎస్టీలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారుల సమాధానం చెప్పాలని రిజర్వేషన్లు మారుస్తారా లేదా అంటూ నిలదీస్తున్నారు.

## ఘనంగా "శ్రీ శ్రీ శ్రీ వినాయక వీరభద్రేశ్వర స్వామి, నంది, మూషిక" శిఖర ప్రతిష్టాపన

### ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్




కుత్బుల్లాపూర్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): జగద్గిరిగుట్ట 126 డివిజన్ సోమయ్య నగర్ లోని శ్రీ వినాయక వీరభద్ర స్వామి దేవాలయం నందు నిర్వహించిన "శ్రీశ్రీశ్రీ వినాయక వీరభద్రేశ్వర స్వామి, నంది, మూషిక" శిఖర ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిష్టాపన మహోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ప్రతీ ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, దైవస్మరణ ద్వారా చేపట్టే ప్రతీ పని వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు ముంతాజ్, జగద్గిరిగుట్ట శ్రీ వీరశైవ లింగాయత్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్, దేవాలయ చైర్మన్ శంకర్, ప్రధాన కార్యదర్శి వీరేశం, సభ్యులు జగదీశ్వర్, రాచన్న, నాగేంద్రప్ప, శివ కుమార్, బస్వరాజ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఎన్నికలవేళ 144 సెక్షన్ అమలు ఎస్ఐ సురేష్



నరసింహులపేట, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): గ్రామ పంచాయితీ ఎన్నికల దృష్ట్యా నరసింహుల పేట మండలంలోని అన్ని గ్రామాలు శాంతి భద్రతల పరిరక్షణకై 144 సెక్షన్ విధిస్తున్నట్లు స్థానిక ఎస్సై మాలోత్ సురేష్ ఆదివారం క్రాంతి న్యూస్‌తో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండల పరిధిలో 144 సెక్షన్ విధించడం జరిగిందని ప్రజలు 4గురు కంటే ఎక్కువ మంది ఒకే చోట గుమ్మి కూడా రాదని, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రజలు సహకరించాలని, హింసకు పాల్పడ్డా, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

## అజ్జకొల్లు స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా కావలి అశోక్

### అజ్జకొల్లు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు



వనపర్తి, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): మదనాపురం మండలం అజ్జకోలు గ్రామ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా కావలి అశోక్ కుమార్ ఆదివారం నామినేషన్ దాఖలను పెద్దలు, యువకుల సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి సమస్యకు పరిష్కార దిశగా పనిచేస్తానని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని ఒక యువకునిగా అవకాశం ఇస్తే అందరికీ మన గ్రామం అజ్జకొల్లును అందరికి అభివృద్ధిలో ఆదర్శంగా చేస్తానని మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తూరు సర్పంచ్ అభ్యర్థిగా మాధవి పూర్ణచందర్

### తొలిరోజు నామినేషన్ వేసిన మహిళా నాయకురాలు.



తొర్రూరు, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ఆరంభమైంది. ఆదివారం మండలంలోని గుర్తురు గ్రామంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మహిళా నేత వెల్తూరి మాధవి పూర్ణచందర్ నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్లు స్వీకరించారు. డిసెంబర్ 2న సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల సమయం ముగుస్తుంది. డిసెంబర్ 3న నామినేషన్లు పరిశీలించి చెల్లుబాటైన నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. తిరస్కరించిన నామినేషన్లపై డిసెంబరు 4న అప్పీళ్లు స్వీకరించి మరుసటి రోజున పరిష్కరిస్తారు. డిసెంబరు 6వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. డిసెంబర్ 14న పోలింగ్ జరగనుంది. కాగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా వెల్తూరి మాధవి పూర్ణచందర్ ఉన్నారు. దళిత , సామాజిక ఉద్యమాల్లో వారు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఈ యశస్విని రెడ్డిల నాయకత్వంలో గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పార్టీ నాయకత్వం ఆదేశించి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటిస్తే గ్రామ అభివృద్ధికి పాటుపడతానని మాధవి పూర్ణచందర్ వెల్లడించారు.

## రాజారం గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థినిగా మందుల అరుణ

### మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక




ఖమ్మం/తిరుమలాయపాలెం, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): తిరుమలాయపాలెం మండలంలోని రాజారం గ్రామానికి చెందిన, మహిళా నాయకురాలు మందుల అరుణ, ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వెంటనే రాజారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థినిగా, మందుల అరుణను ప్రకటిస్తున్నట్లు, దయాకర్ రెడ్డి వెల్లడించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, అరుణ కృషి చేయాలని దయాకర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగాపురం వీరన్న, సామా శ్రీనివాస్ రెడ్డి, గుండాల మల్లయ్య, సామా నర్సిరెడ్డి, పేర్ల నాగయ్య, సామా రాజిరెడ్డి, హనుమంత రెడ్డి, మందుల చిరంజీవి, మందుల నాగయ్య, మందుల యల్లయ్య, మెట్టు మంగయ్య, మెట్టు వెంకన్న, గుండాల లింగయ్య, సామా శ్రీనివాస్ రెడ్డి, పేర్ల గంగయ్య, ఏనుగు చంద్రారెడ్డి, సామా మధుసూధన్ రెడ్డి, మందుల అశోక్, సామా చెన్నారెడ్డి, మెట్టు రవి, గుండాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై అన్ని మండలాలతో సమీక్ష సమావేశం

### సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నర్సంపేట, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): నియోజకవర్గంలో అన్ని మండలాల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి క్యాంపు కార్యాలయంలో నేడు పంచాయతీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్ని మండలాల నాయకులకు పంచాయతీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అదే విధంగా డిసెంబర్ 5న నర్సంపేట నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి పర్యటనని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.




## పెంచలయ్య హత్య కేసు.. కీలక విషయాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్



ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): గంజాయి వ్యాపారానికి అడ్డు వస్తున్నాడని నెల్లూరు జిల్లాలో సీపీఎం కార్యకర్త పెంచలయ్యను నడీరోడ్డుపై దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. అరవ కామాక్షి అనే మహిళ గంజాయి వ్యాపారం చేస్తూ ఓ గ్యాంగ్ మెయిన్టైన్ చేస్తూ ఈ దారుణానికి పాల్పడింది. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ శ్రీనివాస్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పెంచలయ్య హత్య కేసులో మొత్తం 14మంది ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం 9మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. మిగిలిన ఐదుగురి కోసం గాలిస్తున్నామని అన్నారు.

నిందితుల నుండి 7 మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు పెంచలయ్య పోరాటం చేసేవాడని అన్నారు. గంజాయి స్మగ్లర్ అయిన కామాక్షి పెంచలయ్యపై కక్ష పెంచుకుందని అన్నారు. తన దందాకు అడ్డు వస్తూ పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే నెపంతో హత్య చేయించిందని చెప్పారు. గంజాయి కేసులో కామాక్షిని అరెస్ట్ చేశామన్నారు. ఇదిలా ఉంటే కామాక్షి రాజకీయనాయకుల అండదండలు, పోలీసుల సపోర్ట్ తోనే గంజాయి వ్యాపారం చేసిందనే ఆరోపణలు వస్తున్నాయి.

## లిక్కర్ కేసులో మరో సంచలనం.. జగన్ ఓఎస్డీ ఆస్తుల జప్తు...?



ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): ఏపీ లిక్కర్ కేసు లో పెను సంచలనం వెలుగులోకి వచ్చింది. మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి పాత్ర ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే ఆయన చేసిన అక్రమాలనూ తాజాగా వెలికి తీశారు. మద్యం అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడి తెలంగాణలో భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అంతేకాదు ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించి ఐటీ నిబంధనలనూ ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయింది. దీంతో కృష్ణమోహన్ రెడ్డి ఆస్తుల జప్తుపై సిట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మందుబాబులను బురిడీ కొట్టించిన వైన్స్.. ఇద్దరు అరెస్ట్, రిమాండ్



ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): మందుబాబులను బురిడీ కొట్టించిన వైన్ షాపు సిబ్బందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలిలో పీఆర్ వైన్స్ సిబ్బంది కొంతకాలంగా మందుబాబులను మోసం చేస్తున్నారు. నీళ్లు కలిపిన మద్యాన్ని అమ్ముతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు.. వైన్స్ షాపుపై దాడి చేశారు. దీంతో అసలు విషయం బయట పడింది. నీళ్లు కలిపిన మద్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. షాపులో పని చేసే ఇద్దరు సిబ్బందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పీఆర్ వైన్స్ యాజమానులపై కేసు నమోదు చేశారు.


## సాలూరు లైంగిక వేధింపుల కేసు.. పోలీసులపై మహిళ సంచలన ఆరోపణలు



ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): మంత్రి సంధ్యారాణి కుమారుడు, ఆమె పీఏ లైంగిక వేధింపులకు పాల్పడతున్నారంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ మహిళ సంచలన ఆరోపణలు చేసింది. విజయనగరంలో మెడికల్ టెస్టుల కోసం బాధితురాలు వెళ్లగా అనంతరం మీడియాతో మాట్లాడింది. మంత్రికి అనుకూలంగా పోలీసులు విచారణ చేస్తున్నారనే అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించింది. శుక్రవారం మధ్యాహ్నం మెడికల్ టెస్టులకు పిలిచి శనివారం సాయంత్రం వరకు పోలీసుల అధీనంలోనే ఉంచారని చెప్పింది.

తన పిల్లలతో కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన ఫోన్ తో సహా ఇంట్లో 3 ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పింది. తనను వేధించిన మంత్రి పీఏ సతీష్‌ని విచారణకే పిలవలేదని ఆరోపించింది. మంత్రి పీఏ హ్యాపీగా తిరుగుతున్నాడని, ఈ కేసుతో సంబంధం లేని పిల్లలను కూడా ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరింది. ఇదిలా ఉంటే ఈ కేసులో పీఏ సతీష్ పై బీఎన్ఎస్ 64(1), 74, 79, 318(4), 329(3), 115(2), 324(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద సతీష్ పై కేసులు నమోదు చేశారు.

## ఇంట్లోకి చొరబడి వ్యక్తిని నరికి చంపిన దుండగులు.. మహిళ పరిస్థితి విషమం




ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): ఇటీవల కాలంలో హత్యలు మరీ ఎక్కువయ్యాయి. చిన్న, చిన్న విషయాలకే కొందరు విచక్షణ కోల్పోతున్నారు. ఎదురుంది కుటుంబ సభ్యుడైనా, స్నేహితుడు, పరాయి వ్యక్తి అనే తేడా లేకుండా దారుణానికి ఒడిగడుతున్నారు. కత్తులతో దాడి చేసి చంపేస్తున్నారు.గంజాయి వ్యవహారంలో నెల్లూరులో సీపీఎం నేత పెంచలయ్య హత్య సంచలన రేపిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటన మర్చిపోకముందే రాష్ట్రంలో మరో క్రైమ్ కలకలం రేపింది.

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో తల్లీకొడుకుపై దుండగులు కత్తులతో దాడులకు దిగారు. పట్టపగలు ఇంట్లోకి చొరబడి కొడుకు సాంబశివరావును నరికి చంపారు. అడ్డుకోబోయిన తల్లి కృష్ణకుమారిపైనా దాడి చేశారు. ఈ ఘటనలో సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందగా తల్లి కృష్ణకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. కానీ కృష్ణకుమారి పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఈ దారుణానికి ఒడిగట్టిన దుండగులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

## రెండు ఆర్టీసీ బస్సులు ఢీ.. 65 మంది ప్రయాణికులకు..!



ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం తప్పింది. రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సమయంలో రెండు బస్సుల్లో మొత్తం 65 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటిగాయాలు కాలేదు. దీంతో ప్రయాణికులంతా ఊపరిపీల్చుకున్నారు. ఈ ఘటన రావూరు– చిట్వేలు ఘాట్ రోడ్డు జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రెండు బస్సులను రోడ్డు నుంచి పక్కకు తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమ జంట కోసం పోలీసుల సాహసం స్టేషన్ తలుపులు మూసివేసి మరీ




ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): కాలాలు మారినా.. ప్రేమ వివాహం మీద మన సమాజంలో కొందరి ఆలోచనా ధోరణి ఏమాత్రం మారడం లేదు. ముఖ్యంగా కులాంతర వివాహాలు చేసుకుంటే.. తల్లిదండ్రులు కన్నప్రేమను మరిచి దారుణాలకు తెగిస్తున్నారు. విడదీయడానికి ప్రయత్నిస్తున్నారు. కుదరకపోతే చంపేస్తున్నారు. తాజాగా నూజివీడులో ఇలాంటి సంఘటనే ఒకటి వెలుగులోకి వచ్చింది. ప్రేమ పెళ్లి చేసుకున్న నూతన దంపతులు ప్రాణభయంతో పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు, బంధువులు స్టేషన్‌లోకి ప్రవేశించి మరి వారిపై దాడి చేయడానికి ప్రయత్నించారు. పోలీసులను అడ్డుకుని మరీ యువకుడిని చితకబాదారు. దాంతో, పోలీసులు స్టేషన్ తలుపులు మూసి వేసి మరీ ప్రేమికులను కాపాడారు. ఈ సంఘటన ఏలూరు జిల్లా, నూజివీడులో వెలుగు చూసింది.

నూజివీడు , బాపునగర్‌కు చెందిన ఓ యువతి, యువకుడు ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి వారి వారి ఇళ్లలో అనుమతి లభించలేదు. దాంతో, పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ సభ్యుల నుంచి వస్తోన్న బెదిరింపుల కారణంగా.. ప్రాణభయంతో నూజివీడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి పరిస్థితి వివరించి.. తమకు రక్షణ కల్పించాల్సిందిగా పోలీసులను వేడుకున్నారు. దాంతో, పోలీసులు ఆ జంటను స్టేషన్‌లోనే ఉంచారు.

ప్రేమ జంట స్టేషన్‌లో ఉన్నట్టు ఇరు కుటుంబాలకు తెలిసింది. దీంతో వారు అక్కడికి చేరుకుని స్టేషన్ ముందు గొడవకు దిగారు. అంతటితో ఆగక.. పోలీసులను పక్కకు నెట్టి మరీ వారిపై దాడికి దిగారు. ఈక్రమంలో కుటుంబ సభ్యుల దాడిలో సదరు యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై గాయపడ్డ యువకుడిని, యువతిని స్టేషన్ లోపలికి తీసుకెళ్లి తలుపులు, గేట్లు మూసివేశారు.

అయినా సరే పోలీసు స్టేషన్ లోపలికి చొరబడేందుకు ఇరు కుటుంబాల సభ్యులు ప్రయత్నించడంతో.. అక్కడ తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పోలీసుల రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు చేపట్టారు. అలానే ప్రేమ జంట భద్రత కోసం అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు వర్గాలు చెప్పుకొచ్చాయి. ఈ సంఘటనతో నూజివీడు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. ప్రేమ జంట రక్షణ కోసం కఠిన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

## ఉచిత పథకాలతో తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు తెలిసొస్తోంది.. ఆర్బీఐ మాజీ గవర్నర్ సంచలన వ్యాఖ్యలు




ఏపీ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): దేశవ్యాప్తంగా ఎన్నికల్లో గెలుపొందేందుకు పార్టీలు ఉచిత పథకాల మంత్రాన్ని జపిస్తున్నాయి. ఒకరిని మించి మరొకరు పోటీ పడి మరీ ఉచిత పథకాలు అనౌన్స్ చేస్తున్నారు. అయితే వీటిలో చాలా వరకు ఎన్నికల ప్రచారంలో హామీలుగానే మిగిలిపోతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ప్రభుత్వాలు ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఉచిత పథకాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచిత పథకాల ఎన్నికల్లో పార్టీలను గెలిపించవచ్చునేమో కానీ అవి దేశాన్ని నిర్మించలేవని హెచ్చరించారు.

తాజాగా ఓ జాతీయ మీడియాకు రాసిన వ్యాసంలో ఆయన ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ఉచిత హామీలు, అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఉచిత పథకాలు అమలు చేసే విషయంలో పడుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. హామీలపై ఎన్నికైన ప్రభుత్వాలు ఇప్పుడు వాటిని నెరవేర్చడంలో ఇబ్బంది పడుతుండటం లోతైన సమస్య అని ఆయన హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన సంక్షేమ నిర్మాణం ఊహించిన దానికంటే చాలా ఖరీదైనది అనే విషయాన్ని ఇప్పుడు నేర్చుకుంటోందన్నారు. ఇక తెలంగాణ సంవత్సరాల తరబడి పెద్ద ఎత్తున ఉచిత పథకాలు/ఆర్థిక సహాయం అందిస్తూ 'ఫిస్కల్ హ్యాంగోవర్' (ప్రభుత్వాలు విపరీతమైన వ్యయాలు చేసిన తర్వాత ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు) పరిస్థితితో పోరాడుతోందన్నారు. సామాజిక బదిలీలను పెంచడం వల్ల ఇతర విచక్షణా ఖర్చులకు తక్కువ స్థలం ఉందని మహారాష్ట్ర కర్ణాటక గ్రహించాయని ఆయన అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు సామాజిక బదిలలను పెంచడం వల్ల ఇతర స్వచ్ఛంద వ్యయాలకు స్పేస్ తగ్గుతోందని గ్రహిస్తున్నాయని పేర్కొన్నారు.

గతంలో రాజకీయాల్లో రేవ్డీ (ఉచితాలు) సంస్కృతిని ఖండించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వాటి శక్తిని చూసిన తర్వాత తాను కూడా ఉచితాల సంస్కృతి స్వీకరించినట్లు కనిపిస్తోందని సుబ్బారావు గుర్తు చేశారు. ఇది పక్షపాత వైఫల్యం కాదని నిర్మాణాత్మక రాజకీయ సమస్య అని పేర్కొన్నారు. ఏ పార్టీ కూడా ఉచిత పోటీలో వెనుకబడి ఉండటానికి ఇష్టపడవన్నారు. ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్ల ఎన్నికలను ప్రస్తావిస్తూ.. పార్టీలు నగదు వాగ్దానాలతో ఒకదానితో మరొకటి పోటీ పడ్డాయని గుర్తు చేశారు. పాలక ఎన్?డీఏ దాదాపు 1.2 కోట్ల మంది మహిళలకు రూ. 10 వేలు బదిలీ చేస్తే ప్రతిపక్ష మహాఘట్ బంధన్ కూటమి రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఏడాదికి రూ. 30,000, ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చిందన్నారు.

మన ఆర్థిక రాజకీయాల్లో నిజాయితీ మరియు జవాబుదారీతనాన్ని పునరుద్ధరించాల్సిన సమయం వచ్చిందని అందువల్ల పార్టీలు ఇచ్చే ఉచిత పథకాలకు ఎంత ఖర్చు అవుతుంది వాటిని ఎక్కడి నుంచి సేకరిస్తారు? ఎప్పటి వరకు అమలు చేస్తారు అనే జాతీయ ప్రవర్తనా నియమావళిని రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# బి ఆర్ కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 వ ఉచిత హెల్త్ క్యాంప్




కుత్బుల్లాపూర్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): సూరారం 129 డివిజన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీలో బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ ఉచిత వైద్య శిబిరం. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజాల కోసం ఉచిత వైద్య శిబిరం. ఈ కార్యక్రమమం ని పరుష శ్రీశైలం యాదవ్, జగన్ ముధిరాజ్ పర్యవేక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి బి కె ఆర్ ఫౌండేషన్ అధినేత బొంగునూరి కిషోర్ రెడ్డి, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో రావడం జరిగింది



# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




ఖమ్మం, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున, ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని, తాత్కాలికముగా రద్దు చేయడం జరిగిందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సాంబశివరావు సేవలు మరువలేనివి

## నివాళులర్పించిన మేకల మల్లి బాబు యాదవ్.



ఖమ్మం/ఇల్లందు, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): మాజీ మంత్రివర్యులు దివంగత నేత రా%శీ% రెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన శిష్యుడు, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ యువజన అధ్యక్షులు, ప్రముఖ పత్రిక విలేఖరి ముక్తి సాంబశివరావు, ఇటీవల హార్ట్ ఎటాక్ తో మరణించారు. జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లి బాబు యాదవ్ పాల్గొని, సాంబశివరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కోరుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అనంతరం మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ, సాంబశివరావు మరణం వ్యక్తిగతంగా నాకు తీరని లోటని, పీసా లాంటి చట్టాలపై ఎంతో అవగాహన కలిగిన వ్యక్తి అని, వారు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, వివిధ పత్రికలలో విలేకరిగా పని చేస్తూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తి లేకపోవడం, గుండె వ్యాధితో మరణించడం చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో హార్ట్ ఎటాక్ తో చిన్న పెద్ద తేడా లేకుండా అనేకమంది మరణిస్తున్నారని, ముఖ్యంగా యువకులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సాధ్యమైనంతవరకు ఇంటి ఆహారాన్ని స్వీకరించాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వలన ఇలాంటి అకస్మాత్తు మరణాలకు దూరంగా ఉండవచ్చు అని, వైద్యులు సూచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎం.పీ.టీ.సీ జగన్నాథ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, తోటకూరి శివయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మాలపాటి సత్యం, రాందాసు సుమన్, సీతారాములు, బావ్ సింగ్, బాదావత్ నాగరాజు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు

## కఠినంగా వ్యవహారిస్తాం

## పెద్దమందడి ఎస్ఐ శివకుమార్



వనపర్తి, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా కాగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా ఉడాలని ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని,ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒకరి పై ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికలలో శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు.ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు.అక్రమ డబ్బు, మద్యం, పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు సోషల్ మీడియాలో ఒకరిని కించపరచినట్లు అయితే వంటి తప్పిదాలు ఎక్కడైనా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారు అన్నారు.

# కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక



పరకాల, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు (మాజీ ఎంపీపీ) గునిగంటి కృష్ణ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి గునిగంటి కృష్ణను పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డా.,ఏపిజె అబ్దుల్ కలామ్ మెమోరియల్ అవార్డ్ అందుకున్న రాజేష్



మంచిర్యాల, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): డా., ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమం హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో భవ్యంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి , టాలీవుడ్ ఫిలిం ఇండస్ట్రీకి చెందిన మహతి,బిగ్ బాస్ ఖ్యాతి మనికంత, హాజరయ్యారు. ఈ వేడుకలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున బెస్ట్ సోషల్ సర్వీస్ – గోల్డెన్ నంది అవార్డును జన్నారం మండలం కామన్ పెల్లి గ్రామానికి చెందిన కత్తెరపాక రాజేష్ అందుకున్నారు. ప్రజాసేవ, యువతలో అవగాహన, విద్యారంగ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ సేవా కార్యక్రమాలతో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డును ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్వీకరించిన రాజేష్ కుమార్ మాట్లాడుతూ– "ఈ అవార్డు నా వ్యక్తిగత గౌరవం కాకుండా, నా సేవా కార్యక్రమాలకు తోడ్పడిన ప్రతి ఒక్కరి ప్రోత్సాహానికి గుర్తు. ఇక ముందూ మరింత సేవ చేయడానికి ఇది నాకు ప్రేరణ" అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, సినీ ప్రముఖులు, యువత, సామాజిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# హై టెన్షన్ వైర్లు తొలగించాలి

కరీంనగర్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): తీగలగుట్టపల్లి, హనుమయున్ నగర్, చంద్రపూరు కాలని, సరస్వతి నగర్, సుబాష్ నగర్, ఉదయనగర,వావిలాల పల్లి వీదులలో మధ్యలగల నివాసగృహములపై నుండి వెళ్ళె హై టెన్షన్ వైర్లు తొలగించాలని జిల్లా కలెక్టర్కు పాలు మారలు విన్నపం చేసిన అధికారులు స్పందన లేదు. తీగల గుట్టపల్లి నుండి, వావిలాల పల్లి, వరకు సుమారు 200 మంది నివాస గృహాలు పై ఇట్టి వైర వెళ్ళమన్నది. ఇట్టి ప్రాంతంలో సుమారుగా 1500 మంది ఇంటి పై నుండి వెళ్ళుచున్నవి. ఖాళీ స్థలాలు ఉండి ఇల్లు కట్టు కోకపోవడం, ఇంట పైనుండి వెళ్ళడం వలన వర్షం పడినపుడు షాకి గురి కావడం వలన ఇంటలోపల ఉన్న గృహోపకరణాలు దగ్ధం అవుచున్నాలి. కరెంటు తీగల వలన వారి కుంటుంబాలు అనారోగ్య పరమైన సమస్యలు తలెత్తుచున్నవి నగరంలో బత్తుల వెంకన్న ఇంట వద్ద ప్రమాదంలొ ఒక వ్యక్తి చేతి కోల్పోవడం జరిగింది. సంఘటనలు తరచుగా జరుగుచున్నవి. ఇండ్లపై నుండి వెళ్ళె వైర్లను తొలగించవలసిందిగా ప్రజలు బస్తీ వాసులు వచ్చి రోడ్డుపై నిరసన కార్యక్రమం చేస్తూ. తొలగించాలని కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాచకోన సత్యనారాయణ రావు.





గొడిసాల రమేష్ గౌడ్ ఆలకుంట అశోక్ .గంటాల కృష్ణ .చూపా లక్ష్మణ్ దేవేందర్ రావు .కె వరౌధన్ శ్రీనివాస్ వంకల రాజేందర్ .కె బాపురెడ్డి వికృష్ణమూర్తి కె రాజశేఖర్ రాములు సుమన్ కుమార్ వెంకట్రమణ లక్ష్మారెడ్డి వెంకటేష్ మహేందర్ జి రాములు వెంకన్న కోటేశ్వర్ విమల్ కుమార్ కె వరంధన్ గంటాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి



పరకాల, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): ఆదివారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ వార్డ్ మెంబర్ పెంతల మోహన్ బిఆర్ఎస్ గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు కొండోజు జగదీశ్ పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.అనంతరం వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకి గుర్తింపు లభిస్తుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వైపే ప్రజలు చూస్తున్నారని గ్రహించి, బి.ఆర్.ఎస్ %డ% బిజెపి పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు.అలాగే, కొత్తగా చేరిన కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ పాత, కొత్త లేకుండా అందరూ కలిసి కట్టుగా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలకు చేరిన వారిలో పెంతల శ్రీనివాస్, సుధాకర్, కర్ణాకర్, సతీష్, మహేష్, బుచ్చిరెడ్డి, సాంబరాజు దాదాపు 50 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

# వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చేయండి

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



శాయంపేట, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): సర్పంచ్ ఎన్నికల్లో శాయంపేట మండలంలో వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఈరోజు ఆదివారం సాయంత్రం భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలోని ఎస్ వీ కే కే వేడుకల మందిరంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో జరిగిన సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకోవాలని, వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు వచ్చిన గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడైనా ఆర్థికంగా బలహీనంగా ఉంటే, ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆ అభ్యర్థి విజయానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను, నాయకులను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టుకుని గెలిపించుకుని రావాలని పిలుపునిచ్చారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వెయ్యాలి



కరీంనగర్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు రాజ్యాంగ బద్ధంగా కల్పించిన ఓటు హక్కును వినియోగించుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో కులాలు, మతాలు, అతీతంగా ప్రజల పక్షాన ప్రజా సేవకుని ఎన్నుకోవాలని ప్రముఖ వ్యాపారి సామాజికవేత ఏం శ్రీనివాస్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజల్ని చైతన్య పరచడంలో భాగంగా విస్తృతంగా పర్యటిస్తున్నానని చెప్పారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికల తో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల్ని చైతన్య పరిచానని అదే విధంగా స్థానిక సంస్థల్లో కూడా నిస్వక్షపాతంగా ఎలాంటి ఒత్తిడికి లేకుండా ప్రజల పక్షాన ఉండి స్థానిక సమస్యలతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించే అభ్యర్థులను ఎన్నుకోవాలని ఓటర్లను కోరుచున్నారు. ఓటర్లను చైతన్యపరచడంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సామాజిక విత ఎం శ్రీనివాస్ కుమార్.

# తీవ్రమైన జలుబుతో ఇబ్బందులు పడుతున్నారా..? అయితే ఈ ఇంటి చిట్కాలను పాటించండి..!

హెల్త్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): సాధారణంగా చాలా మందికి సీజన్లు మారినప్పుడు లేదా వాతావరణం మరీ చల్లగా ఉన్నప్పుడు ముక్కు పట్టేసి దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. అయితే దగ్గు అంత సులభంగా రాకున్నా జలుబు మాత్రం చేస్తుంది. దీంతో తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది. జలుబు వచ్చిన వారికి ఏ పనిచేయాలనిపించదు. చాలా అవస్థగా ఉంటుంది. అయితే జలుబు చేసిన వారు మెడికల్ షాపుకు వెళ్లి మందులను తెచ్చి వేసుకుంటారు. దీంతో జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఇలా మందులను తరచూ వాడడం మంచిది కాదు. కనుక జలుబును సహజసిద్ధంగానే తగ్గించుకోవాల్సి ఉంటుంది. జలుబు తగ్గేందుకు సహజసిద్ధమైన చిట్కాలను వాడితే జలుబు మళ్లీ చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. కనుక జలుబు తగ్గేందుకు సహజసిద్ధమైన చిట్కాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఈ క్రమంలోనే ఎప్పుడు జలుబు చేసినా ఈ చిట్కాలను అనుసరించాల్సి ఉంటుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

వాము, బెల్లం..

50 గ్రాముల బెల్లానికి ఒకటిన్నర టీస్పూన్ వామును కలిపి మెత్తగా నూరి రెండు గ్లాసుల నీటిలో వేసి బాగా మరిగించాలి. ఆ మిశ్రమాన్ని ఒక గ్లాస్ అయ్యాక స్టవ్ మీద నుంచి దించి చల్లారిన తరువాత వడకట్టి రెండు పూటలా తాగితే జలుబు మాయమవుతుంది. అలాగే నల్ల జీలకర్రను కొద్దిగా తీసుకుని శుభ్రమైన వస్త్రంలో మూటకట్టి అప్పుడప్పుడు కొద్దిగా నలుపుతూ వాసన పీలుస్తుంటే ముక్కు దిబ్బడ జలుబు త్వరగా తగ్గుతుంది. అలాగే శొంఠి కషాయాన్ని రాత్రి పడుకునే ముందు పావు కప్పు చొప్పున తాగితే జలుబు నుంచి వెంటనే ఉపశమనం లభిస్తుంది.

తులసి ఆకుల కషాయం..

సాంబ్రాణి పువ్వును వస్త్రంలో చుట్టి మూట కట్టి అప్పుడప్పుడు వాసన పీల్చినా జలుబు



త్వరగా తగ్గుతుంది. అలాగే జలుబు నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్క, పసుపు, జాపత్రి, లవంగాలను సమానంగా తీసుకుని బాగా నూరి అందులో తేనె కలిపి పూటకు ఒక టీస్పూన్ చొప్పున తీసుకుంటే తగ్గుతుంది. అలాగే మిరియాలు, అల్లం, తులసి ఆకులను సమాన భాగాల్లో తీసుకుని బాగా నూరి వీటితో కషాయం కాచి పూటకు పావు కప్పు చొప్పున నిత్యం 3 పూటలా తీసుకోవాలి. దీంతో జలుబును తగ్గించుకోవచ్చు.

అదేవిధంగా చిన్న కరక్కాయలు, తెల్ల కవిరి సమానంగా తీసుకుని బాగా కలిపి నూరి ఉడికించాలి. ముక్కు పైన పట్టులా వేయాలి. దీంతో జలుబు తగ్గుతుంది. మంచి గంధాన్ని వాసన చూస్తే తుమ్ములు తగ్గుతాయి. కొత్తిమీర వాసన చూసినా తుమ్ములు తగ్గుతాయి. అలాగే కొత్తిమీర ఆకుల రసంలో కాస్త తేనె కలిపి తాగుతున్నా కూడా జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఆహారాలు..


జలుబు నుంచి ఉపశమనం పొందేందుకు పలు ఆహారాలు కూడా మేలు చేస్తాయి. జలుబు బాగా ఉన్నవారు శాకాహారులు అయితే వెజిటబుల్ సూప్‌ను తాగాలి. అదే నాన్ వెజ్ తినేవారు అయితే చికెన్ సూప్‌ను తాగాలి. దీని వల్ల గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. దీంతో జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. అలాగే మిరియాల పొడిని పాలలో కలిపి రోజుకు మూడు సార్లు ఒక కప్పు చొప్పున తాగుతుండాలి. ఇది కూడా జలుబు తగ్గేలా చేస్తుంది. జలుబు అధికంగా ఉన్నవారు యాపిల్, పైనాపిల్, బొప్పాయి, దానిమ్మ వంటి పండ్లను తింటుంటే ఉపయోగం ఉంటుంది. మిరియాలతో చారు చేసి కూడా తినవచ్చు. ఇలా జలుబు తగ్గేందుకు ఆయా చిట్కాలు ఎంతో మేలు చేస్తాయి.

# గోధుమలు అంటే కేవలం చపాతీలే కాదు.. ఇలా కూడా తీసుకోవచ్చు.. ఎన్నో లాభాలను అందిస్తాయి..!

హెల్త్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): చపాతీలు అనగానే మనకు గోధుమ పిండి గుర్తుకు వస్తుంది. ఎందుకంటే చాలా మంది గోధుమ పిండితోనే చపాతీలను తయారు చేసి తింటారు. గోధుమలను మరలో ఆడించి పిండిగా మార్చి ఆ పిండితో చపాతీలను చేస్తారు. కానీ గోధుమలు అంటే కేవలం చపాతీల కోసం మాత్రమేనా..? ఇంక దేనికీ వాటిని వాడలేమా..? అంటే.. వాడవచ్చు.. అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గోధుమలను కేవల చపాతీల కోసమే కాకుండా వాటిని ఇతర వంటకాలకు కూడా ఉపయోగించవచ్చు. అలాగే వాటిని నేరుగా కూడా తినవచ్చు. ఈ క్రమంలోనే గోధుమలను తరచూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఇవి మనకు అనేక పోషకాలను అందిస్తాయి. కనుక వీటిని తరచూ తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

గోధుమ మొలకలు..

గోధుమలతో చాలా మంది అనేక రకాల వంటకాలను చేస్తుంటారు. వీటితో పిండి వంటలను ఎక్కువగా చేస్తారు. అవి ఎంతో రుచిగా ఉంటాయి. ఇక గోధుమలతో రవ్వను చేసి దాంతో కూడా పలు వంటకాలు చేస్తుంటారు. గోధుమ రవ్వతో తయారు చేసే ఉప్మా ఎంతో రుచిగా ఉంటుంది. ఇందులో పలు రకాల కూరగాయలను వేసి తయారు చేస్తే ఎన్నో పోషకాలను కూడా పొందవచ్చు. ఇక గోధుమలతో మొలకలను తయారు చేసి కూడా తినవచ్చు. వీటిని ఎండబెట్టి పిండి చేసి దాన్ని కూడా ఉపయోగించవచ్చు. సాధారణ గోధుమ పిండి కన్నా ఇలా మొలకలతో తయారు చేసే గోధుమ పిండిలో పోషకాల శాతం పెరుగుతుంది. ఇక గోధుమ మొలకలను పిండిగా మార్చి దాన్ని పటిక బెల్లం లేదా బెల్లంతో కలిపి తింటే శరీరానికి




ఎంతో బలం కలుగుతుంది. దేహం దృఢంగా మారుతుంది. కండరాలు నిర్మాణం అవుతాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసే వారికి ఈ ఆహారం ఎంతో మేలు చేస్తుంది.

గోధుమ రవ్వ..

గోధుమ రవ్వతో జావను తయారు చేసి అందులో కొద్దిగా ఉప్పు, చక్కెర కలిపి తాగుతుండాలి. దీని వల్ల జ్వరం వచ్చిన వారు త్వరగా కోలుకుంటారు. నీరసం, అలసట తగ్గుతాయి. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. బద్దకం పోతుంది. గోధుమ పిండితో హల్వాను తయారు చేసి తింటుంటే శరీరానికి బలం లభిస్తుంది. ముఖ్యంగా చిన్నారులకు దీన్ని తరచూ తినిపించాలి. దీని వల్ల వారి ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. ముఖ్యంగా వారి ఎముకలు నిర్మాణమవుతాయి. ఎముకలు దృఢంగా మారుతాయి. గోధుమ పిండిని కాస్త వేయించి దాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి అంతే మోతాదులో చక్కెర కలిపి తింటుండాలి. దీని వల్ల కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే గుండెల్లో మంట, అసిడిటీ, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. గోధుమలను మరలో నూకల్లా ఆడించి అనంతరం వాటితో అన్నం తయారు చేసి తింటుండాలి. దీని వల్ల దేహం పుష్టిగా మారుతుంది. దృఢంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు.

షుగర్ ఉన్నవారికి..

గోధుమలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్న ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గడం తేలికవుతుంది. షుగర్ ఉన్నవారికి గోధుమలు ఎంతో మేలు చేస్తాయి. గోధుమ రవ్వ లేదా గోధుమ నూకతో ఉప్మా, అన్నం వంటివి చేసుకుని తరచూ తింటుండాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. గోధుమల్లో ఉండే ఫైబర్ షుగర్‌ను తగ్గిస్తుంది. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. అలాగే వీటిని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం తగ్గించుకోవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా గోధుమలతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



క్రాంతి
సోమవారం 01 డిసెంబర్ 2025

# క్రీడలు

epaper.krtvnews.com



## వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన రోహిత్ శర్మ



స్పోర్ట్స్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరో సంచలన రికార్డు నమోదు చేశారు. సిక్స్‌ల్లో వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేశారు. పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది(351 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డ్‌ను రోహిత్ శర్మ బ్రేక్ చేశారు. ఇప్పటివరకు 269 వన్డే ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ శర్మ.. 352 సిక్స్‌లు బాదారు. ఆదివారం రాంచీ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో ఈ ఘనత సాధించారు. కాగా, టీ20, టెస్ట్ క్రికెట్‌కు ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికాలో 2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌లో టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. బాగా బరువు తగ్గి, స్లిమ్‌గా మారి.. ఫిట్‌నెస్‌ను సైతం మెరుగుపర్చుకున్నాడు. ఇటీవల ముగిసిన ఆసీస్ టూర్‌లో బ్యాట్‌తోనూ రాణించాడు. వయసు పెరుగుతున్నా.. తనలో ఇంకా పరుగుల దాహం తగ్గలేదని నిరూపిస్తున్నాడు. పాకిస్తాన్ ప్లేయర్ రికార్డును బ్రేక్ చేయడంతో టీమిండియా ఫ్యాన్స్ అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఫైనల్‌కు దూసుకెళ్లిన శ్రీకాంత్.. టైటిల్ నిరీక్షణకు తెరదించుతాడా?



స్పోర్ట్స్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ ప్లేయర్, తెలుగు కుర్రాడు కిదాంబి శ్రీకాంత్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. టోర్నీలో జోరు మీద ఉన్న అతను ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన సెమీస్‌లో శ్రీకాంత్ 21-15, 19-21, 21-13 తేడాతో మరో భారత ఆటగాడు మంజునాథ్‌పై గెలిచాడు. యువ షట్లర్ నుంచి శ్రీకాంత్ గట్టిపోటీనే ఎదుర్కొన్నాడు. 59 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో మూడో గేములో శ్రీకాంత్‌ను విజయం వరించింది. శ్రీకాంత్ టైటిల్ నెగ్గి చాలా ఏళ్లు అవుతుంది. 2017లో చివరిసారిగా టైటిల్ గెలిచాడు. ఈ ఏడాది మలేసియా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్‌కు వెళ్లినా నిరాశ తప్పలేదు. మరి శ్రీకాంత్ టైటిల్ నిరీక్షణకు తెరదించుతాడా?లేదా? చూడాలి. ఫైనల్‌లో హాంకాంగ్ ప్లేయర్ జాసన్ గునావన్‌తో తలపడనున్నాడు.

మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ జోడీ కూడా ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫైనల్‌లో 21-11, 21-15 తేడాతో మలేసియాకు చెందిన ఓంగ్ జిన్ యి-కార్మెన్ టింగ్ జంటను ఓడించింది. గతేడాది విజేతగా నిలిచిన గాయత్రి-ట్రీసా జోడీ ఈ సారి కూడా టైటిల్ కాపాడుకోవాలని చూస్తోంది. ఉమెన్స్ సింగిల్స్‌లో భారత యువ షట్లర్లు తన్వి శర్మ, ఉన్నతి హుడా లకు నిరాశ తప్పలేదు. సెమీస్‌లో హుడా 15-21, 10-21 తేడాతో తుర్కియేకు చెందిన నెస్లిహాన్ ఆరిన్ చేతిలో ఓడిపోయింది. టోర్నీలో సంచలన ప్రదర్శన చేసిన తన్వి కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది. జపాన్ క్రీడాకారిణి అకెచి చేతిలో 21-17, 21-16 తేడాతో పరాజయం పాలైంది.

## వన్డేల్లో విరాట్ కోహ్లీ సంచలన రికార్డు



స్పోర్ట్స్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): రాంచీ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అదరగొట్టారు. చాలా రోజుల తర్వాత సెంచరీతో చెలరేగారు. 102 బంతుల్లో 103 పరుగులు చేశారు. దీంతో వన్డేల్లో 52వ సెంచరీని నమోదు చేశారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో టీమిండియా దిగ్గజం రోహిత్ శర్మ కూడా రఫ్ఫాడించారు. హాఫ్ సెంచరీ చేశారు. ప్రస్తుతం 40 ఓవర్లు ముగియగా.. నాలుగు వికెట్లు కోల్పోయిన భారత్.. 260కి పైగా పరుగులు చేసింది. ఇదిలా ఉంటే.. తాజా సెంచరీతో విరాట్ వన్డేల్లో 52 సెంచరీలు పూర్తిచేశారు.

## ప్రియురాలితో ఎంగేజ్మెంట్ చేసుకున్న మహిళ క్రికెటర్



స్పోర్ట్స్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ మహిళా క్రికెట్ ప్రపంచంలో దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ క్లో ట్రయాన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ సంతోషకరమైన వార్తను పంచుకుంది. తన ప్రియురాలు, జింబాబ్వేకు చెందిన కంటెంట్ క్రియేటర్ అయిన క్రిస్టెన్ మిచెల్ నెటివేల్ తో ఆమె ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు ప్రకటించింది. మోకరిల్లి, ఉంగరం తొడుగుతున్న అద్భుతమైన క్షణాలను ట్రయాన్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ఆ ఫొటోలు అభిమానుల హృదయాలను గెలుచుకున్నాయి. 100కు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించిన ట్రయాన్, తమ బంధాన్ని ప్రకటించడం పట్ల ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు,సెలబ్రిటీల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రేమకు సరిహద్దులు లేవని నిరూపిస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణులు తమ ప్రియురాళ్లతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టే ట్రెండ్‌లో క్లో ట్రయాన్ తాజాగా చేరింది. గతంలో ఇంగ్లాండ్‌కు చెందిన కేథరిన్ సీవర్-బ్రంట్, న్యూజిలాండ్ ప్లేయర్స్ అమీ సాటర్త్‌వైట్, లీ తహుహు వంటి ప్రముఖ క్రికెటర్లు కూడా ఇలాగే తమ ప్రియురాళ్లతో వివాహ బంధం లోకి అడుగుపెట్టారు. క్రికెట్ మైదానంలో, జీవితంలోనూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే ట్రయాన్, ఈ ప్రకటన ద్వారా తన వ్యక్తిగత బంధాన్ని బహిరంగంగా పంచుకోవడం LGBTQ+ కమ్యూనిటీలో గొప్ప ప్రేరణ గా నిలుస్తోంది. కాగా ఈ జంట త్వరలో పెళ్లి చేసుకోనున్నట్లు తెలుస్తోంది.

## షాకింగ్ న్యూస్.. IPLకు విధ్వంసకర బ్యాటర్ రస్సెల్ రిటైర్మెంట్



స్పోర్ట్స్ న్యూస్, 30 నవంబర్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ 2026 ను దృష్టిలో పెట్టుకొని అన్ని జట్లు తమకు అవసరం లేని ప్లేయర్లను జట్ల నుంచి విడుదల చేసింది. దీంతో స్టార్ ప్లేయర్లు త్వరలో జరగబోయే మినీ వేలంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ కు స్టార్ క్రికెట్లర్ రిటైర్మెంట్ ప్రకటిస్తున్నారు. శనివారం డుప్లెసిస్ రిటైర్మెంట్ ప్రకటించిన ఐపీఎల్ వేలం నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించగా.. ఈ రోజు మరో విధ్వంసకరమైన బ్యాటర్, ఆల్ రౌండర్ రస్సెల్ రిటైర్మెంట్ ప్రకటించారు. కోల్‌కతా నైట్ రైడర్స్‌రపున భారీ ఆల్‌రౌండర్‌గా రాణించిన ఆండ్రీ రస్సెల్ ఐపీఎల్ నుంచి వైదొలుగుతున్నట్లు (రిటైర్మెంట్) ప్రకటించారు. అలాగే వచ్చే సీజన్‌లో తాను కేకేఆర్ సపోర్టింగ్ స్టాఫ్‌లో చేరనున్నట్లు రస్సెల్ తెలిపారు.

ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, తనకు అండగా నిలిచిన యాజమాన్యం, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉద్వేగభరితమైన వీడియోను రస్సెల్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఐపీఎల్‌లో 140 మ్యాచ్‌లు ఆడిన రస్సెల్ తన కెరీర్‌లో 2,651 పరుగులు సాధించడంతో పాటు, 123 వికెట్లు తీశారు. తన పవర్ హిట్టింగ్‌తో అనేక మ్యాచ్‌లలో కేకేఆర్ కు ఒంటిచేత్తో విజయాలు అందించిన రస్సెల్ రిటైర్మెంట్ ప్రకటన అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

ఈ రిటైర్మెంట్ ప్రకటన సరిగ్గా ఫాఫ్ డుప్లెసిస్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన మరుసటి రోజునే రావడం గమనార్హం. కేవలం 24 గంటల్లోనే ఇద్దరు కీలక అంతర్జాతీయ ఆటగాళ్లు ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పడంతో.. ఐపీఎల్ 2026 మినీ వేలం ముందు ఫ్రాంఛైజీల వ్యూహాలలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. రస్సెల్ కేకేఆర్ యొక్క సపోర్టింగ్ స్టాఫ్‌లో చేరడం వల్ల, రాబోయే యువ ఆటగాళ్లకు అతని అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# క్రికెటర్‌తో మృణాల్ డేటింగ్.. ఇట్స్ అఫిషియల్




బ్యూటిఫుల్ మృణాల్ ఠాకూర్ వరుస అవకాశాలతో దూసుకుపోతుంది. తెలుగు, తమిళ్, హిందీ ఇండస్ట్రీల్లో స్టార్ హీరోల సరసన నటిస్తూ మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ అందుకుంది. కెరీర్ పరంగా సూపర్ డూపర్ సక్సెస్ రేట్ కలిగి ఉంది. కానీ పర్సనల్ విషయానికి వచ్చే సరికి మాత్రం డేటింగ్ రూమర్స్ వస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లు హీరో ధనుష్‌తో ప్రేమాయణం నడుపుతుందని న్యూస్ స్ప్రెడ్ అయింది. త్వరలోనే అఫిషియల్ అనౌన్స్‌మెంట్ ఇవ్వనున్నారనే వార్తలు కూడ వచ్చాయి. కానీ సడెన్‌గా ఈ రూమర్స్‌లో మరో ట్విస్ట్ ఎంటర్ అయింది. క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌తో మృణాల్ డేటింగ్ చేస్తున్నట్లు ప్రజెంట్ న్యూస్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. దీనిపై స్పందిస్తున్న నెటిజన్లు.. రేపు మరొకరితో డేటింగ్ చేస్తుందనే పుకార్లు రావడంలో అతిశయోక్తి లేదంటున్నారు నెటిజన్లు.

# ఆ రోజులను నా జీవితంలో మర్చిపోలేను

## షాకింగ్ విషయాలు బయటపెట్టిన రకుల్



సినిమా షూటింగ్‌ల్లో ప్రమాదాలు జరగడం కొత్త విషయం కాదు. చిన్న యాక్షన్ సీన్ల నుంచి భారీ స్టంట్‌ల వరకూ, నటీనటులు ఎన్నో రకాల రిస్కులు తీసుకోవాల్సి వస్తుంది. అయితే ఇటీవల ఇలాంటి ప్రమాదాలు మరింత ఎక్కువయ్యాయని ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆందోళన వ్యక్తం అవుతోంది. నిజంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లే సంఘటనలు చోటు చేసుకుంటుండటంతో, భద్రతపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు చెబుతున్నారు. ఇక ఇటీవల 'కాంతార: చాప్టర్ 1' షూటింగ్ సమయంలో జరిగిన ఘోర ప్రమాదం దీనికి ఉదాహరణగా నిలిచింది. షూటింగ్ ప్రక్రియలో పాల్గొన్న ఒక వ్యక్తి దురదృష్టకరంగా ప్రాణాలు కోల్పోవడంతో ఆ సినిమా యూనిట్ తీవ్రంగా షాక్‌కు గురైంది. వెంటనే షూట్‌ని వాయిదా వేసి, భద్రతా చర్యలపై పునర్విమర్శ చేపట్టడం జరిగింది.

ఈ సంఘటన సినీ పరిశ్రమలో సేఫ్టీ స్టాండర్డ్స్‌పై చర్చలను మరింత వేడెక్కించింది. ఇలాంటి సమయంలోనే మరో సంఘటన చోటుచేసుకుంది. రకుల్ ప్రీత్ సింగ్ షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు ఆమె తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. వైద్యులు ఆమెకు ఆరు నెలలు పూర్తిగా విశ్రాంతి అవసరమని చెప్పినా, సినిమా యూనిట్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే షూటింగ్‌కి హాజరైనట్లు ఆమె చెప్పింది. తన ఆరోగ్యాన్ని పక్కన పెట్టి టీమ్ కోసం రిస్క్ తీసుకున్న విషయాన్ని వెల్లడిస్తూ రకుల్ భావోద్వేగానికి గురైంది. "దేదే ప్యార్ దే-2' షూట్ మధ్యలో నాకు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాను. నడుము, కండరాలు దాదాపు దెబ్బతినగా నడవడమే కష్టంగా మారింది నా పరిస్థితి. కొన్ని సందర్భాల్లో కాళ్లకు కరెంట్ షాక్ వచ్చినట్లు కూడా నొప్పి వచ్చింది.

అలాంటి పరిస్థితుల్లో కూడా నేను షూటింగ్‌కు హాజరయ్యాను. యాక్షన్ సీన్లు, గ్యాన్స్ అన్నీ చేశాను. అన్ని పెయిన్ కిల్లర్స్ వాడుతూ, చికిత్స తీసుకుంటూనే షూట్ పూర్తి చేశా. ఏ క్షణంలో ఏమవుతుందో అని ఎమ్ఆర్ఐ రిపోర్ట్‌ను సెట్‌కి తీసుకెళ్లేదాన్ని. ఏదైనా అత్యవసరం అయితే డాక్టర్లకు చూపించొచ్చు అని. ఒక్కసారి షాట్ ఒకే అయితే నెలపై పడిపోయేదాన్ని గాయమైన సమయంలో డాక్టర్లు ఆరు నెలల రెస్ట్ తీసుకోమని చెప్పినా రెండు నెలల్లోనే షూట్‌కి వెళ్లాను. ఆ రోజులను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. ప్రస్తుతానికి పూర్తిగా కోలుకున్నాను" అని చెప్పింది. ఇక ఈ విషయం తెలుసుకున్న అభిమానులు కొందరు షాక్ అవుతుండగా.. మరికొందరు గ్రేట్ అని ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా ఇటీవల అజయ్ దేవ్‌గణ్, రకుల్ కాంబోలో వచ్చిన 'దేదే ప్యాదే-2' బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. రకుల్ కష్టానికి ప్రతిఫలితం దక్కినట్లు అయింది.

# 'కాంతార: చాప్టర్1' సినిమాపై రణ్‌వీర్ సింగ్ వివాదాస్పద కామెంట్స్..

## క్షమాపణలు చెప్పాలంటూ నెటిజన్ల డిమాండ్




కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి స్వయం దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార' సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక ఈ చిత్రానికి ప్రీక్వెల్‌గా వచ్చిన 'కాంతార: చాప్టర్1' కూడా బాక్సాఫీసు వద్ద సంచలన రికార్డు క్రియేట్ చేసింది. అంతేకాకుండా భారీ కలెక్షన్లు రాబట్టడంతో పాటుగా.. సినీ ప్రముఖుల ప్రశంసలు కూడా పొందింది. ఇక ఈ రెండు చిత్రాల్లో పంజురీ దేవపై తెరకెక్కించిన సీన్లు హైలెట్‌గా నిలిచాయి. అంతేకాకుండా కొన్ని సీన్స్‌కి ప్రేక్షకుల్లో అమ్మవారు కూడా పూనడం గమనార్హం. థియేటర్స్‌లో అలా చేసిన వారెందరో ఉన్నారు. అలాంటి సినిమాపై ఓ హీరో వివాదాస్పద కామెంట్స్ చేయడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

తాజాగా, గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఆఫ్ ఇండియా(IFFI) ముగింపు కార్యక్రమంలో రణ్‌వీర్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రిషబ్ శెట్టి అద్భుతంగా చేశారని ప్రశంసలు కురిపించారు. అలాగే హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు సన్నివేశాలు చాలా బాగున్నాయని అన్నారు. అంతటితో ఊరుకోకుండా.. స్టేజ్‌పై కాంతారలో ఎంతో వైరల్ అయిన ఓ అనే శబ్దాన్ని స్టేజ్‌పై చేసి చూపించడంతో పాటు ఈ సీన్‌పై కామెడీ చేయడంతో ట్రోల్స్‌కు గురవుతున్నాడు. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిషబ్ కూడా కొంత అసౌకర్యంగా ఫీల్ అయినట్లు వీడియోలో కనిపిస్తుంది. ఈ వీడియో చూసిన కన్నడిగులు వెంటనే 'కాంతార' టీమ్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ధురంధర్' విడుదల అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక కాంతార రిలీజ్ సమయంతో థియేటర్‌లో దైవంలాగా అరవకండి, నా గెటప్‌లో రావడం లాంటివి చేయకండి అని సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే పనిని స్టేజ్‌పై రణ్‌వీర్ చేయడంతో ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది. రిషబ్ ఎలా స్పందిస్తాడనేది అందరిలో ఆసక్తిగా మారింది. కాగా.. రణ్‌వీర్ సింగ్ త్వరలో 'ధురంధర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో సారా అర్జున్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఇన్నాళ్లూ చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన ఆమె ఈ చిత్రంతో హీరోయిన్‌గా మారుతుండటం విశేషం. ఇక ఈ సినిమా డిసెంబర్ 5న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈక్రమంలోనే రణ్‌వీర్ వివాదంలో చిక్కుకోవడంతో అసలు రిలీజ్ అవుతుందా? వాయిదా పడుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# వెంకటేష్-త్రివిక్రమ్ సినిమాకు క్రేజీ టైటిల్ ఫిక్స్

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్-విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో ఓ భారీ ప్రాజెక్ట్ రాబోతుందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు ఇప్పటికీ ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఫేవరెట్ అనే చెప్పాలి, ఇక ఇప్పుడు వీరి కలయికలో రాబోతున్న మూడో ప్రాజెక్ట్ రాబోతుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపు అవుతున్నాయి. తాజాగా, ఈ సినిమాకు సంబంధించి టైటిల్ కూడా ఫిక్స్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. 'బంధుమిత్రుల అభినందనలతో' పేరు ఫిక్స్ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు టాక్.

త్రివిక్రమ్ స్టైల్లో ఫ్యామిలీ ఎమోషన్స్, వెంకీ కామెడీ కలిసి పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త చిత్రానికి త్రివిక్రమ్ రాసిన కథలో వెంకటేష్‌కు సరిపోయే శైలిలో వ్యక్తిత్వం, వినోదం, మరియు హృదయాన్ని తాకే గుణాలు సమపాళ్లలో ఉండనున్నాయి. త్రివిక్రమ్ తన ప్రత్యేక శైలిలో అర్థవంతమైన పదాలను అల్లిపోసి, ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించేలా టైటిల్‌ను తీర్చిదిద్దాడు. టైటిల్‌లోని శబ్దము మాత్రమే కాదు, దాని వెనకాల దాగిన భావం కూడా కథకు మెయిన్ డ్రైవింగ్ ఫోర్స్‌గా నిలవనున్నాయట. వెంకటేష్ ఈ సినిమాలో కనిపించబోయే కొత్త శేడ్స్ ప్రేక్షకులకు ఒక ప్రత్యేక అనుభూతిని అందించనున్నాయి.

భావోద్వేగాలతో నిండిన సన్నివేశాల్లో ఆయన నటన, హాస్య క్షణాల్లో ఆయన టైమింగ్, యాక్షన్‌లో ఆయన ఎనర్జీ ఈ మూడు కలిపి వస్తున్న ఈ మూవీపై అంచనాలు మరింత పెరుగుతాయి. కుటుంబ ప్రేక్షకులను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని, అన్ని తరాల వారిని ఆకట్టుకునే భావాలతో, వినోదంతో, స్ఫూర్తితో నిండిన కథను తెరపై అందించే ప్రయత్నం జరుగుతోంది. వెంకటేష్ %-% త్రివిక్రమ్ కాంబినేషన్ మళ్లీ రాబోతుందని తెలిసినప్పుడే ఏర్పడిన ఆనందాన్ని, ఈ టైటిల్ మరింత బలపరుస్తూ ప్రేక్షకుల్లో భారీ క్రేజ్‌ను సృష్టించింది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. నటీనటుల, షూటింగ్ వివరాలకు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారట. ఇప్పటికే మొత్తం ఇండస్ట్రీ ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టింది.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com